# వేలం పాట

ఎస్.ఇ. (సూపరింటెండింగ్ ఇంజనీరు) ఆఫీసు ఆవరణలో చెట్టు కింద చాలా సందడిగా వుంది. కార్లు, స్కూటర్లు, సైకిళ్ళు వగైరాలతో ఆవరణ నిండింది. తురాయి చెట్టు నీడలో వాళ్ళంతా ఆప సోపాలు పడుతూ ఎందుకు అవస్థ పడుతున్నారో శివరావ్‌కి అర్థం కాలేదు. భారీ కాయులు, బాన పొట్టల వాళ్ళు, ఎండకి తట్టుకోలేక కూల్ డ్రింక్‌లు, సోడాలు తెగ తాగుతున్నారు.

శివరావ్ స్కూటర్ దిగడం చూసి హడావుడిగా దగ్గరికి వచ్చాడు రామరాజు.

"ఏరా అర్జెంట్‌గా ఇక్కడికి రమ్మని చెప్పి పోయావట. ఇంటికి వెళ్ళగానే మా ఆవిడ చెప్పింది నువ్వొచ్చి వెళ్ళావని. ఏమిటి సంగతి?" అన్నాడు శివరావ్.

"ఏం లేదు అర్జెంట్‌గా వెయ్యి రూపాయిలు కావల్సి వచ్చాయి" అన్నాడు రామరాజు నవ్వుతూ.

"అలాగా! పద అయితే" అని స్కూటర్ స్టార్ట్ చేశాడు శివరావ్.

ఇద్దరూ స్కూటర్ మీద బయల్దేరారు.

"ఏమిటి ఆ చెట్ల క్రిందసందడి?" దారిలో అడిగాడు శివరావ్.

"పంట కాలువ కట్ట మరొక అడుగు ఎత్తు పెంచడానికి టెండర్లు పిలిచారు. ఈ వేళ టెండర్ ఓపెనింగ్" అన్నాడు రామరాజు.

"ఓహో వాళ్ళంతా మీ కంట్రాక్టర్లా?" అన్నాడు శివరావ్ నవ్వుతూ.

"ఆ చూస్తే తెలియడంలా!" అన్నాడు తనూ నవ్వుతూ.

"నువ్వు గూడా టెండర్ వేస్తున్నావా?" ప్రశ్నించాడు రావ్.

"వెయ్యడమా నా బొందా! మన దగ్గర అంత పెట్టుబడి లేదు" అన్నాడు రామరాజు.

"మరి ఇంకెందుకు ఎండలో చావడం. ఆ చెట్ల కింద పడిగాపులు?" అన్నాడు శివరావ్.

"లాభం లేనిదే ఎవడు తిరుగుతాడు బ్రదర్?"

"నీకేం లాభం? ఎవరో పెట్టుబడి వున్నవాడు టెండర్ వేసి వర్కు సంపాదిస్తాడు."

రామరాజు నవ్వాడు.

"కంట్రాక్టర్ల సీక్రెట్ నీకు తెలీదులే. ఇప్పుడు అక్కడ చేరిన కంట్రాక్టర్లందరూ టెండర్ వెయ్యడానికి వచ్చారనుకున్నావా? అందరూ మనలాగే పేరుకే రిజిస్టర్డ్ కంట్రాక్టర్లు. ఎక్కువ మంది దగ్గర డిపాజిట్ కట్టడానికి కూడా డబ్బులేదు. కేవలం వేలం పాటకి వచ్చారు."

"వేలం పాటా? అదేంటి?" ఆశ్చర్యంగా అడిగాడు రావ్.

"ఇప్పుడు ఎస్.ఇ. ముప్పై కిలో మీటర్ల దూరం కాలువ ఒక అడుగు ఎత్తు పెంచడానికి టెండర్లు పిలిచాడు. వర్కు విలువ తొమ్మిది లక్షల ఏభై వేల రూపాయిలు. సుమారు పాతిక మంది కంట్రాక్టర్లు టెండర్ షెడ్యూల్సు కొన్నారు. మామూలుగా కంట్రాక్టర్లు పోటీ పడితే, ఎవరు తక్కువ రేటు కోట్ చేస్తే వారికి వర్కు వస్తుంది. కాని కంట్రాక్టర్లు సామాన్యంగా రింగ్ అవుతారు" చెప్పాడు రామరాజు.

"రింగ్ అంటే?" శివరావ్ అడిగాడు.

వర్కు తీసుకుని, అందుకు కావల్సిన పెట్టుబడి హంగు, ఆర్భాటం వున్న నలుగు రైదుగురు కంట్రాక్టర్లు వేలంపాట పాడతారు. ఎవరు ఎక్కువ పాట పాడితే వారికి వర్కు వెళ్తుందన్న మాట."

"గవర్నమెంట్ వర్కుకి టెండర్లు పిలిస్తే మధ్యలో కంట్రాక్టర్ల వేలంపాట ఏమిట్రా బాబూ?"

"నీకింకా అర్థం కాలేదా?"

"ఉహూ!"

"సరే ప్రత్యక్షంగా చూద్దువుగాని పద" అన్నాడు రామరాజు.

శివరావ్ బ్యాంక్ దగ్గర స్కూటర్ ఆపాడు.

వెయ్యి రూపాయిలు డ్రాచేసి రామరాజుకి ఇచ్చాడు.

రామరాజు గవర్నమెంట్ పేర డిమాండ్ డ్రాఫ్టు తీసుకున్నాడు డిపాజిట్ నిమిత్తం.

ఇద్దరూ బయల్దేరి ఎస్.ఇ. ఆఫీసు ఆవరణలో చెట్ల క్రిందకు చేరుకున్నారు.

"నేనిక వెళ్తాను రా రాజు." అన్నాడు శివరావ్.



"కాసేపు వుండు నీ డబ్బు నువ్వు తీసుకుని వెళ్ళిపోదువుగాని" అన్నాడు రామరాజు.

"అప్పుడే ఇచ్చేస్తావా?" ఆశ్చర్య పోయాడు శివరావ్.

"ఇప్పుడే" అని నవ్వాడు రామరాజు.

** ** **

అరగంట తర్వాత చెట్టు కింద పట్టా మీద కూర్చున్న రామిరెడ్డి వేలం పాట మొదలు పెట్టాడు.

ఆరుగురు కంట్రాక్టర్లు పోటీ పడ్డారు.

వెయ్యి, రెండు వేలు పెంచుకుంటూ పోయారు.

"లక్ష రూపాయిలు" అన్నాడు కృష్ణారెడ్డి అనే కంట్రాక్టరు.

ఇక ఎవ్వరూపాట పాడలేదు.

"కృష్ణారెడ్డిగారు లక్ష రూపాయిలు. ఒకటో సారి... రెండోసారి... కృష్ణారెడ్డిగారు లక్ష రూపాయిలు... వూ... కొట్టేస్తున్నా!"

ఎవరూ పలకలేదు.

"మూడోసారి కృష్ణారెడ్డి గారు లక్ష రూపాయిలు."

కొందరు కృష్ణారెడ్డిని షేక్ హేండ్స్ ఇచ్చి అభినందించారు.

"రెడ్డి ఛాన్స్ కొట్టాడు పో..." అని జోక్స్ వేశారు మరి కొందరు.

"అంతా టెండర్ షెడ్యూల్సు మా మేనేజర్‌కి హేండోవర్ చేసి డబ్బు తీసుకోండి. థాంక్యూ... టూ ఆల్ ఫ్రెండ్స్... బై..." కృష్ణారెడ్డి కారెక్కి వెళ్ళిపోయాడు.

కంట్రాక్టర్లంతా కృష్ణారెడ్డి మేనేజర్ కూర్చున్న జీప్ దగ్గర ఈగల్లా మూగారు.

మేనేజర్ ఒక్కొక్కరి దగ్గరున్న టెండర్ షెడ్యూల్స్ తీసుకుని సూట్ కేసులో నుంచి డబ్బు తీసి ఇస్తున్నాడు.

"మన వాటా నాలుగు వేలు వచ్చాయి బ్రదర్!" అంటూ వచ్చాడు రామరాజు.

శివరావ్ నవ్వాడు.

"ఇప్పుడైనా అర్థమైందా?" అంటూ డబ్బు అందించాడు.

"అర్థమైంది. ఇక మీ రెవ్వరూ టెండర్లు వెయ్యరు. కృష్ణారెడ్డిగారు టెండరు ఒక్కటే వేస్తాడు. వర్కు ఆయనకే వెళ్తుంది. అంతేగా!" అన్నాడు శివరావ్ డబ్బు తీసుకుని జేబులో పెట్టుకుంటూ.

అదే రింగ్ అవడం అంటే" చెప్పాడు రామరాజు.

"నాకు అర్థంకాని విషయం ఒకటి వుంది" అన్నాడు శివరావ్.

"ఏమిటి?"

"ఇప్పుడు కృష్ణారెడ్డి లక్ష రూపాయిలు మీకు పంచి పెట్టాడు గదా! అది ఆయనకు రావల్సిన లాభంలో పోయినట్లే గదా?!" అడిగాడు శివరావ్.

రామరాజు నవ్వాడు.

"అదేం కాదు. ఇప్పుడు ఈయన మాకిచ్చిన లక్ష రూపాయిలు గవర్నమెంట్ దగ్గరే వసూలు చేస్తాడు. ఆయన లాభం ఆయనకే వుంటుంది."

"అదెట్లా?" మళ్ళీ ఆశ్చర్య పోయాడు శివరావ్.

"గవర్నమెంట్ టెండర్లు పిలిచింది తొమ్మిది లక్షల ఏభై వేలకి. రెడ్డిగారు పది శాతం ఎక్కువ వేస్తారు. అప్పుడు వర్కు విలువ మరొక తొంభై అయిదు వేలు పెరుగుతుంది. దట్సాల్" చెప్పాడు రామరాజు.

"ఓర్నీ... దేవుడి పెళ్ళికి అందరూ పెద్దలై పంచుకున్నట్టు ప్రజల సొమ్ము మీరిట్లా పబ్లిగ్గా పంచుకుంటున్నారన్నమాట. మరి ఇదంతా తన ఆఫీసు అవరణలోనే జరుగుతూ వుండగా చూస్తూ అధికారులు వూరుకుంటారా? టెండర్లు క్యాన్సిల్ చేయరా?" అన్నాడు శివరావ్.

"భలే వాడివే! అధికారులు ఎవరు మధ్యలో? వచ్చినట్లు చూస్తూ వూరు కోవాలి. మర్యాదగా వాటా పంచుకోవాలి. కాదు... లేదు... అంటే మా తడాఖా చూపిస్తాం! ప్రజాస్వామ్యం గదా!" రామరాజు నవ్వుతూ అన్నాడు.

— వాణిశ్రీ